# జైలుఖానా

వెనక అంతా సముద్రమే. ఎక్కడా భూమి లేదు. ఆ రోజుల్లో మనుష్యులు ఆ సముద్రపు అలలమీద తేలి ఆడుకుంటూ ఉండేవాళ్ళు. వాళ్ళ కప్పుడు అకాశంలోకి ఎగిరే శక్తి కూడా ఉండేదనుకుంటాను. కాలక్రమాన బుద్ధి పరిపక్వం అయి ఆ అలలమీద ఊగడమూ, ఆ సముద్రంలో ఈదటమూ మొదలైన ఆటలమీద మొహం మొత్తినప్పుడు వారు అట్లా ఆకాశంలోకి ఎంతో ఎత్తుకు ఎగిరిపోయి అక్కడినించి ఆ సముద్రాన్నీ, అందులో ఆడుకుంటున్న వాళ్ళనీ చక్కగా గమనించి అదొక ఆనందం అనుభవించేవారు. తమ మాదిరిగా ఎగరటం నేర్చుకోలేక ఆడుకోటమే పరమావధిగా పెట్టుకున్న వారిని చూస్తే వీరికి కోపంలేదు, అసహ్యంలేదు. "ఇంకా కుర్రవాళ్ళు! ఆడుకోనీ!" అనుకొనేవారు.

కాని కాలం గడిచినకొద్దీ సముద్రంలో కొంతభాగం దిబ్బవెయ్యసాగింది. ఆ దిబ్బ నానాటికీ పెద్దది కాసాగింది.

అది ఏమిటో చూతామని కొందరు ఆ దిబ్బమీదకి ప్రయాణమైనారు. తీరా అక్కడ చేరిన తరవాత అక్కడికి వెళ్ళిన వారికి ఆ దిబ్బను గురించి రెండురకాల అభిప్రాయాలు కలిగినై.

"ఎబ్బే! ఇక్కడ ఏమీ బాగాలేదు. దీనిమీద కొంతకాలం ఉండేటప్పటికి నిర్జలం అయిపోతాం. దీనిమీద సంచలనం ఏదీ? ఆ అలలమీద అంతెత్తు లేచిపడితే కలిగే ఆనందం ఏదీ? మట్టి కాళ్ళకు చుట్టేసుకుంటూ ఏమిటీ పాడుదిబ్బ!" అని దాన్ని తిట్టి కొందరు మళ్ళీ అలలమీదికి ఉరికారు.

కాని మిగిలిన వారు – వీరికి శక్తి యావత్తూ ఉడిగిపోయింది. సముద్రంలో ఆడుకునే మనోల్లాసమూ లేదూ, ఆకాశంలోకి ఎగిరేశక్తిలేదు! – ఏమన్నారంటే, "అమ్మయ్య! ఇదేదో చాలా నిరపాయకరమైన ఏర్పాటు చేశాడు భగవంతుడు. మనం ఇక్కడే ఉండిపోదామా ఏమిటి చెప్మా!.... అమ్మో! ఆ అలలు చూడు ఎంత భయంకరంగా ఉన్నవో! మనం ఆ సముద్రం ఛాయల వెళ్ళనేవద్దూ!" అన్నారు.

సముద్రంమీద తేలి ఆడుకుంటున్నవాళ్ళు ఈ భూచరులను చూసి నవ్వారు. భూచరులకు ఆగ్రహమూ అసూయా కలిగినై.

"మానవజాతి ఈ భయంకరమైన సముద్రం పాలవుతుందనే భగవంతుడీస్వర్గం కల్పించాడు. ఇది క్షేమకరమైనది. మీరు భగవంతుడి ఆజ్ఞను పాలించక పోతే పతితులౌతారు" అని భూచరులు జలచరులతో అన్నారు.

"మీ పిల్లి శాపనార్థాలకు మేము భయపడం, పొండి! పిరికిపందల్లారా!" అని జలచరులు ఎగతాళి చేశారు.

ఆకాశమార్గాన తిరుగుతున్న ధీమంతులు రెండుపార్టీల వారినీ గంభీరంగా గమనిస్తున్నారు.

భూచరులను మొదట ఆవహించిన పిశాచం భయం. వీరు తరవాత పొందిన అభివృద్ధి కంతకూ ఈ భయపిశాచమే అధిష్ఠానదేవత.

వారెప్పుడైతే ఒకసారి ఆ భయం వాతపడ్డారో, ఇక అప్పటినించీ వారికి ప్రాణాలు సురక్షితం చేసుకునే యావతప్ప మరొకటి లేదు. ఎండకు, వానకు, చలికి, వేడికి, సిరుకు, నిప్పుకు, వెలుతురుకు, చీకటికి, ఆకలికి, అజీర్తికి – అన్నింటికీ వెరవటం మొదలుపెట్టారు. "క్షేమం!" అదీ వారి ఆలోచన తెల్లవారిలేస్తే.

వారు ఇళ్ళు కట్టుకున్నారు. వాకిళ్ళు పెట్టుకున్నారు. మళ్ళా ఆ వాకిళ్ళకు తాళాలు పెట్టుకున్నారు. ఒకరిని చూసి ఒకరు భయపడటం నేర్చుకున్నారు.

మధ్య గోడలు పెట్టుకున్నారు. ఇంటిలోపలే మళ్ళీ గోడలు. ఇంటిచుట్టూ ప్రహరీ గోడలు. మనిషికీ మనిషికీ మధ్య గోడ!

జలచరులు నవ్వారు.

"ఎందుకట్లా నవరంధ్రాలు బిగించుకుంటున్నారు? మీకు దేన్ని చూసి ఆ భయం? మీలో మీరు అంతఃకలహాలు కూడా నేర్చుకున్నారేమిటి? ప్రారబ్ధం!" అని వాళ్ళు భూచరులను అడిగారు.

"మేము కర్మ చేస్తూన్నాం. మేము నిర్మిస్తున్నాం. అది మా విధి. భగవంతుడు మమ్మల్ని అట్లా ఆజ్ఞాపించాడు.

"'మీ జీవితాలను ఆ జలచరుల మాదిరిగా వ్యర్థం చెయ్యకండి. మానవ జాతి అభివృద్ధికి అనుకూలంగా నిర్మాణం చెయ్యండి!' అన్నాడు భగవంతుడు.

"ఏమైనా నిర్మించాలంటే ఇక్కడ అవుతుంది కాని ఆ అలలమీద ఏమవు తుంది?

"మా జీవితం కొన్ని నియమాల ననుసరించి వెళుతున్నది. ఏ సమయానికి ఏంచెయ్యాలో మేమంతా ప్రోగ్రాం వేసుకున్నాం. మాకు రేపు అనేదే కాక అనంతమైన భవిష్యత్తు ఉన్నది. మీ పాడు జీవితాలకు ఏమీలేదు. మరుక్షణం మీరు ఏ అలలమీద తేలుతుంటారో తెలియదు.

"ఆడినంత సేపు ఆడుతారు. మీ శక్తి ఉడిగిపోగానే ఆ జీవిత ప్రవాహం మిమ్మల్ని కబళించేస్తుంది. ఎప్పుడో ఒకప్పుడు మీరంతా జీవిత సముద్రానికి బలి కావలసినవారే! మీకు క్షేమంలేదు! క్షేమం మాసొత్తు!" అని భూచరులు అనటం మొదలుపెట్టారు.

భయం క్రమంగా జలచరులను కూడా ఆవహించింది. వారు క్రమంగా ఆ దిబ్బమీదికి ఈదుకుని పోసాగారు. కొంతకాలానికి ఆ సముద్రం పాడుపడి పోయింది. దానిమీద ఎవరైనా నిలిచిపోయి ఉంటే వారు క్రమంగా అక్కడే నశించిపోయినారు.

మానవజాతిలో ఎక్కువభాగం ఎప్పుడైతే భూచరులుగా మారిపోయినారో అప్పుడు జలచరులు రాక్షసులై పోయినారు.

కాని ఆ సముద్రం వాసన మానవ రక్తంలో ఉండిపోయింది. మానవుడికి ఆ అలలమీద భ్రాంతి పోనేలేదు.

"ఇట్లాకాదు మనం యింకా గోడలు కట్టుకుందాం. సముద్రం మనకు కనిపించకుండా చుట్టూ ప్రహరీ కట్టుకొందాం. నలుగురు ఒకచోట చేరితే మళ్ళీ ఆ సముద్రంమీది భ్రాంతి పైకి రావచ్చును. మనిషికీ మనిషికీ మధ్య గోడలు కట్టుకుందాం. ఎక్కడికీ కదలకుండా మనం సంకెళ్ళు వేసుకుందాం. మన

హృదయాలు ఆ సముద్రంకోసం పొంగకుండా హృదయాలకు బిగుతైన కవచాలు తొడుగుదాం!" అనుకున్నది మానవజాతి.

మనుష్యులు ఆ ప్రకారమే చేశారు.

"ఇక మనం మన మనస్సులు నిర్మాణంమీదనే ఉంచగలుగుతాం!" అన్నారు మనుష్యులు.

ఇది పెద్ద జైలుఖానాగా పరిణమించింది. ఎవరో ఆ మాటే అన్నారు.

"నేనిందులో ఉండను. నాకిక్కడ ఊపిరాడటం లేదు. నాకు స్వేచ్ఛ కావాలి. నాకు గాలి కావాలి. జీవిత సముద్రంమీద నేను తేలిపోతాను. ఆ సముద్రం ఎక్కడుంది? నాకు కనిపించదేం? నన్ను చూడనివ్వరేం? నా హృదయం ఒరుసుకుపోతున్నది. ఇది విప్పెయ్యండి. నా హృదయం ఇంకా విశాలంగా పెరుగుతుంది. దాన్ని ఎందుకు పెరగనివ్వరూ? నన్నీ ఆడదానికెందుకు కట్టేశారు? ఈ సంకెళ్ళు తెంపెయ్యండి! ఆ మాధవికీ నాకూ మధ్య గోడకట్టేశారెందుకు? మేమిద్దరమూ ఆ సముద్రంమీద ఆడుకుంటాం!" అని అతను అన్నాడు.

"నీకు తెలీదు, నాయనా! ఆ సముద్రం మహా భయంకరమైనది. అది అంటరానిది. అందులో సమస్తములైన భయంకర జంతుజాలమూ ఉంటుంది. నువ్వు నిష్కారణంగా చచ్చిపోతావు! గాలి కావాలి, వెలుతురు కావాలి అనకు. అవి నీకు ఆరోగ్యకరాలు కావు. మా మాట విను: ఆ మాధవిని నువ్వు సమీపించగూడదు. మీఇద్దరికీ మధ్య భగవంతుడు కట్టిన గోడ తీసేస్తివా భగవంతుడు నిన్ను భయంకరమైన నరకంలో తోస్తాడు!" అని పెద్దలు అతనితో అన్నారు.

"భగవంతుడికి జాలిలేదా? నేను భగవంతుణ్ని అయినా మనుష్యుల్ని ఈ బందిఖానాలో పెట్టి ఇట్లా చంపనే! ఆ మాత్రం ఔదార్యం లేదా భగవంతుడికి!" అన్నాడతడు.

"వీడు నాస్తికుడు. భగవంతుడు తనకన్నా కూడా హీనుడని వాదిస్తున్నాడు!" అన్నారు పెద్దలు.

"ఛీ! మీతో నాకేమిటి? మీ అభిప్రాయాలు నాకు తృణమాత్రం. నేనీ గోడలన్నీ ఛేదించుకుని పోతాను. ఈ సంకెళ్ళు తెంచేస్తాను. ఈ కవచాలు పీకి అవతల పారేస్తాను. నాకు స్వేచ్ఛ కావాలి. నేను స్వేచ్ఛగా చచ్చిపోవటానికైనా సిద్ధంగా ఉన్నానంటే నాలో ఆ తృష్ణ ఎంతగా ఉందో ఊహించుకోండి!" అని అతను గోడలన్నీ పగలగొట్టుకుని సముద్రం ఒడ్డుకు ఒంటరిగా చేరుకున్నాడు.

కాని మాధవి మాత్రం లోకానికి దొరికిపోయింది. జైలు నియమాలననుసరించి ఆమెకు మిగిలిన ఖైదీలు ప్రాయశ్చిత్తాదులు చేసి భగవంతుడు ఆమెను క్షమించాడన్నారు.

మాధవి తోడులేకుండా అతనికి ఆ సముద్రపు అలలమీద ఆడుకునేటందుకు మనస్కరించలేను. "మాధవి ఎప్పుడు వస్తుం"దని నిరీక్షిస్తున్నాడతను. ఆమె లేకపోతే ఆ సముద్రం అతనికి పాడుపడినట్టుంది.

అతన్ని చూస్తే నా గుండె తరుక్కుపోతుంది!

*           *           *

నాకు వార్ధక్యం వచ్చేసింది. పంచేంద్రియాలూ సరిగా పని చెయ్యటం లేదు. నరాలన్నీ సడిలిపోయినై. జైలు నిబంధనలు నన్ను బాధించవు. నన్ను మిగిలిన ఖైదీలు గౌరవంతో చూస్తారు. నా స్వేచ్ఛకు వారు అసూయపడరు. చిన్న పిల్లలనూ మా ముసలివాళ్ళనూ జైలు రూల్సు బాధించవు, అందుకని నేను జైలు నాలుగు మూలలకూ వెళ్ళి ఎక్కడ ఏం జరుగుతున్నదో చూస్తూ ఉంటాను,

ఒకనాడు నేనిట్లా బయలులోకి వచ్చి తలఎత్తి చూచేసరికి ఎవరో గగన మార్గాన తిరుగుతున్నట్టు తోచింది. ఆయన్ను చూచి నేను అక్కడే సాష్టాంగ పడ్డాను. ఆయన నాకన్న చాలా చిన్నవాడు—చప్పున నా పక్కనవాలి "పెద్దలు! మీ చేత ప్రణామం చేయించుకో తగని వాణ్ణి!" అన్నాడు.

"నేను వయస్సు పాటించలేదు, స్వామీ! తమరు గగన మార్గాన్నించి అంతా చూడగలరు. ఆ యోగ్యత మాకు లేదు. మానవ జీవితాన్ని గురించి తమకు తోచిన దేమిటో సెలవివ్వండి!" అన్నాను.

ఆ మహానుభావుడు దీర్ఘంగా యోచించి చివరకు, "భగవంతుడీ ఆకాశమూ, ఈ జలరాశీ, ఈ భూఖండమూ ఇచ్చాడు. ఈ ఆకాశాన్ని అపవిత్రం చేసే సత్తా మానవులకు లేదు. ఈ జలరాశిని పవిత్రతాపవిత్రతలు అంటనే అంటవూ! కాని ఈ భూఖండాన్ని మానవజాతి అపవిత్రం చేసింది.

"అక్కడ అందరికీ అడుగుపెట్టటానికి అర్హత లేదు. మానవ జాతిలో ఎక్కువ భాగం ఈ అలలమీద ఆడుకోటానికి మాత్రమే అర్హత కలవారు. అది తప్పనే అభిప్రాయం కొద్దిమంది చేరి సృష్టించారు.

"ఆ తరవాత అందరూ తాము పవిత్రులమూ అర్హులమూ అనే దురహంకారంతో ఈ భూభాగం మీదికి చేరి, నందనవనాలూ స్వర్గమూ నిర్మించటానికి బదులు ఒక పెద్ద జైలుఖానా తయారు చేశారు!

"ఈ జాతి చెడిపోయింది."

"ఆకాశ మార్గాన ఎవరూ లేరు. సముద్రం యావత్తూ పాడుపెట్టబడి ఉంది. దాదాపు జాతి యావత్తూ ఈ బందిఖానాలో మురుగుతున్నది ఆ బందిఖానాను నిర్మూలం చెయ్యాలి.

"ఈ పంకంలోనించి నూతన శక్తీ కొత్త సుగంధమూ పుట్టాలి! పుట్టుతుంది!" అన్నాడాయన.

"స్వామీ, సంసార సాగరము, జీవయాత్ర అనే పదాలు ఇంకా మేము వాడుకుంటూనే ఉన్నాం. అవి ఎప్పుడు సృష్టి అయినవో చెప్పుతారా? నా కా మాటలే అర్థం కాలేదు!" అన్నాను.

ఆయన నవ్వుతూ సముద్రంపైపు చూపాడు.

"మీరా మాటలెందుకు వాడుతున్నారో నాకూ అర్థం కావటంలేదు. మీలో ఎవరూ అందులో అడుగుపెట్టలేదు సరేకదా దాన్ని సరిగా చూసి అయినా ఎరగరే!" అంటూ ఆయన ఆకాశ మార్గాన ఎగిరిపోయినాడు.

(మొదటిముద్రణ : ఫిబ్రవరి 1937, కారుణ్యం కథల సంపుటి,
యువ కార్యాలయ ప్రచురణ)